క్లుప్తంగా

'అదనపు సమయాన్ని గమనించాలి'

నారాయణపేట: జిల్లాలో ఏప్రిల్ 3, 10 వ తేదీల్లో జరిగే పదో తరగతి తెలుగు, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలకు కేటాయించిన 20 నిమిషాల అదనపు సమయాన్ని విద్యార్థులు గమనించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 3న ప్రారంభమయ్యే పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయన్నారు. కానీ తెలుగు, సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యలో పేపర్ మార్పిడికి ఈ అదనపు సమయం కేటాయించినట్లు తెలియజేశారు.

ఆర్టీసీలో బదిలీలు.. పదోన్నతులు

నారాయణపేట రూరల్ : ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్‌లో ఆర్‌ఎం శ్రీదేవి పలువురు అర్హత కల్గిన వారికి పదోన్నతులు ఇవ్వడంతో పాటు రిక్వెస్ట్ పెట్టుకున్న దరఖాస్తు దారులకు బుధవారం బదిలీ ఉత్తర్వులు అందించారు. ఈ మేరకు నారాయణపేట డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ ఎంఏ రవూఫ్‌కు ఇదే డిపోలో ఏడీసీగా పదోన్నతి లభించింది. అదేవిధంగా ఎన్.శ్రీనివాసులు (మహబూబ్‌నగర్), పీ.ముకుందప్ప (కోస్గి), సీ.పర్వతాలు (అచ్చంపేట) కండక్టర్లతో పాటు పీ.వెంకటయ్య (షాద్‌నగర్), కేబీరెడ్డి (జేడీ విజిలెన్స్) డ్రైవర్లకు ఏడీసీలుగా పదోన్నతి కల్పించి ఆరుగురికి నారాయణపేట డిపోకు కేటాయించారు. అదే విధంగా ఇక్కడ పనిచేస్తున్న ఏడీసీలు వీబీ చారీ, జీ.రాజశేఖర్‌రెడ్డిలను షాద్‌నగర్‌కు, జీవనజ్యోతిని మహబూబ్‌నగర్ డిపోకు బదిలీ చేశారు. ఇక డిపోలో ఆయిల్ సెక్షన్ డీసీగా పనిచేస్తున్న టీఐ–3 ఎస్‌ఎం వహిదోద్దీన్‌ను మహబూబ్‌నగర్‌కు కేటాయించారు.

'కోయిలకొండకు బస్సు సౌకర్యం కల్పించాలి'

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రం నుంచి కోయిలకొండ మండలానికి బస్సు సర్వీసు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, రైతులు, వ్యాపారులు జిల్లా కేంద్రానికి రావడానికి అవస్థలు పడుతున్నారని వాపోయారు. దీంతో ప్రయాణికులు మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లి అక్కడి నుంచి కోయిలకొండకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. కోయిలకొండలో ప్రసిద్ధి చెందిన శ్రీ రామకొండకు శ్రీరామనవమి సందర్భంగా వెళ్లడానికి ఇబ్బందిగా మారిందని ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

దామరగిద్ద: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఉద్మల్‌గిద్ద విద్యార్థిని ఐశ్వర్యకు సహాయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ. 6 వేలు అందించారు. ఫౌండేషన్ నిర్వాహకులు దస్తగిరి, ఇబ్రహీం, రంజిత్, శివప్ప, ఉదయ్, నర్సింహులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

నారాయణపేట టౌన్ : టీడీపీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వినయ్‌మిత్ర యాదవ్ నేతృత్వంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పట్టణ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, ఫైవ్ మెన్ కమిటీ మాజీ నాయకులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల టీడీపీ నాయకులు ఉమ్మడి జిల్లా పార్లమెంట్ నియోజక వర్గ సభ్యుడు రాములు యాదవ్, మొగులప్ప, వీరన్నగౌడ్‌ల సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలకు తరలివెళ్లారు. బస్వరాజ్, అంజిలప్ప, వెంకటప్ప, రాజప్ప, వెంకటప్పలు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో అధ్యక్షుడు శ్రీనివాస్ పార్టీ జెండావిష్కరణ చేపట్టారు. నాయకులు కిష్టప్ప, హన్మంతు, నాగేష్, సత్యప్ప, వెంకటయ్య, వేణుగోపాల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

మరికల్: కోయిల్‌కొండ మండలం వింజమూరులో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని బుధవారం మరికల్ జాతీయ రహదారిపై దళిత సంఘాల నాయకులు రాస్తారోకో చేపట్టారు. నాయకులు రామస్వామి, బాల్‌రాజ్‌లు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్, ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ గోపాల్, నాయకులు శ్రీను, కమల్, బాలకిష్ట, కుర్మయ్య, శివ, రాజు, వెంకటయ్యలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నారాయణపేట రూరల్ : మండలంలోని శ్యాసన్‌పల్లి పీఎస్‌లో బుధవారం సాయంత్రం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల అభ్యున్నతికి చేయాల్సిన పనులను తెలియజేశారు. ఉన్నతంగా రాణించాలని సూచించారు. సాంస్కృతిక, క్రీడాపోటీల విజేతలైన విద్యార్థులను అభినందించి బహుమతులు అందిచారు. హెచ్‌ఎం జగదీష్, టీచర్లు భాస్కర్ రెడ్డి, కృష్ణవేణి, భువనేశ్వరీ, ఎస్‌ఎంసీ చైర్మెన్ గోవిందమ్మ పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్‌పై అనాసక్తి

- అమ్మకాలు చేపట్టడానికి సుముఖంగా లేని చిరు వ్యాపారులు
- మున్సిపల్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగిన వైనం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అమ్మకాలు నిర్వహిస్తున్న రైతులు



చెరుకు బండిని తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా రాష్ట్ర ప్రభుత్వం సమీకృత వాణిజ్య సముదాయాన్ని సుమారు రూ. 6 కోట్లు వెచ్చించి నిర్మింపజేసింది. ఇటీవల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఒకే దగ్గర అని రకాల అమ్మకాలు చేసేందుకు వీలుగా ఈ మార్కెట్ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. కానీ అమ్మకాలు చేపట్టడానికి వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. చిరువ్యాపారులు ఇప్పటికీ రోడ్ల వెంబడే పూలు, పండ్లు, కూరగాయల అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. కాగా జిల్లా కేంద్రంలోని చిరువ్యాపారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విక్రయాలు సాగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సునీత సుమారు రెండు వారాల కింద నుంచే అవగాహన కల్పించారు. ఇటీవల మున్సిపల్ అధికారులు, సిబ్బంది సంబంధిత వ్యాపారులపై ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అమ్మకాలు చేపట్టాలని తీసుకు వచ్చారు. పలువురు వ్యాపారుల తోపుడు బండ్లను మార్కెట్ వద్దకు తరలించారు. కానీ వారు తిరిగి మరుసటి రోజు నుంచే పాతస్థలాల్లో అమ్మకాలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి వ్యాపారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. సిబ్బందిపైకి వారు ఎదురుతిరిగారు. తమ వ్యాపారాలు మార్కెట్ వద్దకు తరలించలేమని, ప్రజలు అక్కడికి వచ్చి కొనుగోలు చేయరని వాదనకు దిగారు. దీంతో రూ. కోట్లు ఖర్చుచేసి నిర్మించిన మార్కెట్ సముదాయం నిరుపయోగంగా మారే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా రైతు బజార్‌లో కూరగాయలు అమ్మేవారు మాత్రమే ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో విక్రయాలు చేపడుతున్నారు. వారు కూడా అక్కడి నుంచి రైతు బజార్‌కు వస్తారేమోనని అంటున్నారు.

సుముఖత చూపడం లేదు

కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు చిరు వ్యాపారులను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దకు తరలించే ప్రయత్నం చేశాం. తద్వారా కలిగే ఉపయోగాన్ని వారికి వివరించాం. అయినప్పటికీ అక్కడికి రావడానికి వారు సుముఖంగా లేరు. వాగ్వివాదానికి దిగుతున్నారు. ఎప్పటిలాగే పాత స్థలాల్లో విక్రయాలు చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

– శ్రీధర్, మున్సిపల్ సూపర్ వైజర్, నారాయణపేట

రోడ్లపై విక్రయాలు వద్దు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే చిరు వ్యాపారులు విక్రయాలు కొనసాగించాలని ఆదేశించాం. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కొంతమందిని అక్కడకు తరలించే ప్రయత్నం చేశాం. కానీ వారు తిరిగి పాతస్థలాల్లోనే విక్రయాలు చేపట్టిన విషయం మా దృష్టికి రాలేదు. మరోసారి వారికి అవగాహన కల్పిస్తాం. రోడ్లపైనే విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుని జరిమానా విధిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

రికార్డు స్థాయిలో తైబజార్ వేలం

మరికల్: మండల కేంద్రంలోని తైబజార్ వేలం ఎన్నడు లేని విధంగా రూ. 6.20 లక్షలు పలికింది. మరికల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం వేలం నిర్వహించారు. 8 మంది ఒక్కొక్కరు రూ. 50 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలంలో సీమ శ్రీనివాసులు తైబజార్‌ను దక్కించుకున్నారు. కాగా గతేడాది వేలం రూ.4.71లక్షలుగా ఉంది. సర్పంచ్ గోవర్దన్, ఉపసర్పంచ్ శివ, కార్యదర్శి శ్రీనివాస్ రావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతకు సంబంధించిన తైబజార్ వేలం ఈ సారి రికార్డు స్థాయిలో రూ.3.26 లక్షలు పలికింది బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అమరేందర్‌రెడ్డి అధ్యక్షతన వేలం పాట ప్రారంభించారు. ధన్వాడకు చెందిన ద్యావరి రాజు వేలం దక్కించుకున్నారు. ఎంపీటీసీ ఉమేష్, గోవర్దన్‌గౌడ్, మాధవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పటిష్టతకు కృషిచేద్దాం



ఊట్కూరులో కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

ఊట్కూరు: బీఆర్ఎస్ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకరలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. మండలంలోని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సమావేశానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో టీఎస్ ట్రైడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, రైతుబంధు మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఊట్కూరులో మత్స్యకార్మికుల కమ్యూనిటీ హాల్‌కు బుధవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. మత్స్యకార్మికుల అభివృద్ధికోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. భవన నిర్మాణానికి తన సొంత నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ నిధుల నుంచి రూ. 5 లక్షలు తన సిఫారసు మేరకు మంజూరు చేశారని అన్నారు. అనంతరం కొల్లూరులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు శివరామరాజు, నారాయణ, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వాయిదా



లాటరీ పద్ధతిని నిలిపివేయాలంటున్న లబ్ధిదారులు

మద్దూరు: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక బుధవారం వాయిదా పడినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి రెండు మండలాలకు కలిపి 8 యూనిట్ల కోసం 286 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి ఈ నెల 23న ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 189 మంది హాజరయ్యారు. దీంతో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై ఉన్నతాధికారుల సలహా మేరకు మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్ధతి నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా రెండు మండలాలకు కలిపి 8 యునిట్లు మంజూరు మాత్రమే చేస్తే ఎలా అని అధికారులను లబ్ధిదారులు నిలదీశారు. కొంత మందికి బ్యాంకు అధికారుల నుంచి రుణం మంజూరైందని ఫోన్లు కూడా వచ్చాయన్నారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఎంపికను వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ప్రకటించారు. యూనిట్లను పెంచాలనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం



విద్యుత్ కాంతులతో తాయమ్మ, భవానీ, హనుమాన్ మందిర్

నారాయణపేట రూరల్ : మండలంలోని అప్పిరెడ్డి పల్లి శివారులోని రాందేవుని గుట్టపై గురువారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పల్లకీ సేవ, కల్యాణం, అన్నదానం, భజనా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో గురువారం శ్రీరామ నవమి పురస్కరించుకుని వీహెచ్‌పీ, బజంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. అదే విధంగా సాయి హనుమాన్ మందిరంలో శ్రీ సీతా రాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గాంధీనగర్ తాయమ్మ, భవానీ, హనుమాన్ మందిరం, మూల హనుమాన్ దేవాలయ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం, శక్తిపీఠంలో గురువారం సాయంత్రం వేడుకలను స్వామిజీ శాంతానంద పురోహిత్ నిర్వహిస్తున్నట్లు శక్తి పీఠం సభ్యులు తెలిపారు. గద్వాల చంద్రశేఖర్‌రావు భక్తి సంగీత విభావరి ఉంటుందన్నారు. టీ.వీ సీరియల్ నటీమణులు శ్వేత, సుమనశ్రీ హాజరవుతున్నట్లు తెలిపారు.

మక్తల్: శ్రీరామనవమి సందర్భంగా మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న రాంలీలా మైదానంలో సీతా రాముల కల్యాణోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కల్యాణోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

ఊట్కూరు: మండల పరిధిలోని కొల్లూరులోని ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర గురువారం సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు భీమాచారి మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ

నారాయణపేట: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ స్థానిక బీసీ వసతి గృహ అధికారులకు ఉచితంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి క్రిష్ణమాచారి మాట్లాడుతూ వసతి గృహ ఆవరణలో కూరగాయాల విత్తనాలను నాటి పండిస్తే ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలతో భోజనం అందించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వసతి గృహ అధికారులను డీఏఓ కోరారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులను బుధవారం క్షేత్ర సందర్శన తీసుకువెళ్లారు. హెచ్‌ఎం జ్యోతి, ఒకేషనల్ ఉపాధ్యాయురాలు అనురాధ సమక్షంలో మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించారు. మేనేజర్ జైపాల్, క్యాషియర్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్ విద్యార్థులకు బ్యాంకు లావాదేవీల గురించి వివరించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

మద్దూరు: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీకేజీపై సీబీఐతో గానీ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో గానీ సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ సంఘం తాలుకా అధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు ఒక రోజు దీక్ష చేపట్టారు. చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీనివాస్, గుండపప, వెంకట్‌రాములు, వెంకటప్ప, గోపాల్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పిరెడ్డిపల్లిలో వీధి నాటకం

మద్దూరు: మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో ఏడు రోజులుగా నిర్వహించిన సంపూర్ణ రామాయణ వీధి నాటకం బుధవారంతో ముగిసింది. గ్రామానికి చెందిన నాటకోపాధ్యాయుడు హన్మంతు ఆధ్వర్యంలో 60 మంది ఔత్సాహికులు ఈ నాటకాన్ని ఏడు రోజుల పాటు నిర్వహించారు. సెల్‌ఫోన్ రాజ్యమేలుతున్న ఈ కాలంలో కూడా వీధి నాటకాలకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదని హన్మంతు తెలిపారు.

చెక్కుల పంపిణీ

నర్వ: ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణీతో ఆడపడుచులకు అండగా నిలిచారని జెడ్పీటీసీ గౌనిజ్యోతి అన్నారు. బుధవారం నర్వ తహసీల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



నారాయణపేట రూరల్ : మండలంలోని శ్యాసన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హాజరై ఉపాధ్యాయ పాత్ర పోషించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందిచారు.

నర్వ: మండలంలోని కల్వాల్ ఉన్నత పాఠశాల, నర్వ ఎస్‌వీఎం ప్రైవేటు పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్యం, అడ్వైజర్ రామన్‌గౌడ్, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జల్దిబిందె ఉత్సవం



కృష్ణా నది నుంచి జలాలు తీసుకువస్తున్న భక్తులు

మాగనూర్: కొత్తపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ పరిధిలో జల్దిబిందె కార్యక్రమం బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం నుంచి యువకులంతా కాలినడకన కృష్ణ మండలంలోని నదికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది నుంచి తీసుకువచ్చిన జలాలతో ఆలయంలో అభిషేకం చేశారు. గురువారం నుంచి శ్రీరామనవమిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జాతర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం



కాల్వలను పరిశీలిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల రైతులకు అండగా ఉంటామని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాల్వల్లో మొక్కలు, చెట్లు పెరిగిపోయి, చివరి వరకు నీరు అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గురువారం నుంచే వాటిని తొలగించే పనులు చేపడతామన్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. రైతులు రఘు, హన్మంతు, అశోక్‌గౌడ్, లియాకత్ అలీ, శ్రీను, కృష్ణయ్య , బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులు సత్తాచాటాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రాజేందర్

మాగనూర్(కృష్ణ): మండల పరిధిలోని గూడేబల్లూర్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజేందర్ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు సరస్వతిదేవి పూజతో కార్యక్రమం ప్రారంభించి ఉపాధ్యాయులను, అతిథులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ధన్వాడ: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం సంకీర్తన, కలశపూజ, ప్రభోత్సవం తదితర కార్యక్రమాలు చేపట్టారు. 31 తెల్లవారుజామున రథోత్సవము, స్వామి వారి అభిషేకము, విష్ణు సహస్రనామ పారాయణము, స్వామి వారి సర్వదర్శనము, అడుగుల భజన నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1న సర్వదర్శనము, పల్లకీ సేవా, మహా మంగళ హారతితో జాతర పరిసమాప్తం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈఓ, ఇతర అధికారులు

నారాయణపేట రూరల్ : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని డీఈఓ లియాకత్ అలీ సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన ఫూసల్ పహాడ్ ట్యాలెంట్ టెస్ట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల్లో దాగివున్న తెలివితేటలను బయటకు తీయడంతో పాటు పోటీ తత్వాన్ని పెంపొందించడానికి నిర్వహిస్తున్న టెస్టు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. 20ఏళ్లుగా నిర్విరామంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. కాపీరైటింగ్ పై నమ్మకం పెట్టుకుంటే నష్టపోతారని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోలేరని సూచించారు. అనంతరం టెస్ట్‌లో మొదటి మూడు స్థానాల విజేతలకు నగదు పురస్కారాలు అందించారు. అదేవిధంగా టాప్ 20 స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, పాఠశాలల టాపర్‌లకు ప్రశంసాపత్రం, బహుమతులు, పుస్తకాలు అందించారు.

అవగాహన సదస్సు :

ప్రముఖ సైకలాజిస్ట్ గంపనాగేశ్వర్‌రావు శిష్యుడు సాయిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షల సమయంలో నడుచుకునే విధానం, పరీక్షలకు సంబంధిచిన మెళుకువలు తెలియజేశారు. నిర్వాహకులు శేర్‌కృష్ణారెడ్డి, పారిజాత, ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, టాస్ కో ఆర్డినేటర్ యాదయ్య శెట్టి, డీఎస్ఓ భానుప్రకాష్, తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహా, కోషాధికారి కిశోర్, భాస్కర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, సీతారాములు, కుర్మయ్య, విశ్వనాథ్ రెడ్డి, శంకర్, అపర్ణ, మాధవి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ప్రభుత్వం

దామరగిద్ద: ముదిరాజ్‌లకు అన్ని విధాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో అధ్యక్షుడు ఈదప్ప ఇంట్లో ఏర్పాటు చేసిన మండల ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సహకారంతో నారాయణపేట జిల్లా కేంద్రంలో ముదిరాజ్ భవన్ ఏర్పాటుకు తన వంతుకృషిచేస్తానన్నారు. ప్రతిగ్రామంలో మత్స్యకార్మిక సంఘాలు ఏర్పాటు కావాలని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం కల్గి ఉండి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సరాఫ్ నాగరాజ్‌ను మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. నాయకులు రాములు, జనార్దన్, రాజు, శ్రీనివాస్, సాయిలు, నర్సిములు, విజయ్, మొగులప్ప, శ్రీనివాస్, గుండప్ప, నరహరి, లాలప్ప పాల్గొన్నారు.